జిల్లాకేంద్రంలోని శివాజీచౌక్‌లో..



ఆకట్టుకుంటున్న డిజైన్లు



జయశంకర్ చౌరస్తా వద్ద..



మట్టి సీసాలు



మట్టి పాత్ర.. ఆరోగ్యమాత్ర

వేసవికాలం కావడంతో ఎండలు మండిపోతున్నాయి. దీంతో ప్రజలు సాధారణంగానే చల్లనినీటిని తాగేందుకు పరితపిస్తుంటారు. ఫ్రిడ్జ్ నీరు కంటే మట్టిపాత్రల్లోని నీరు తాగితే ఆరోగ్యకరమని వైద్యులు సూచిస్తున్నారు. జిల్లాకేంద్రంలోని శివాజీచౌక్, ప్రొఫెసర్ జయశంకర్ చౌరస్తా ప్రాంతంలో కుండలు, ఆదిలాబాద్ రంజన్లు, మట్టితో తయారు చేసిన సీసాలను విక్రయిస్తున్నారు. వీటిలో కొన్ని పాత్రలు స్థానికంగా తయారు చేసినవి కాగా.. మరికొన్ని రాజస్థాన్, మహారాష్ట్ర నుంచి తెప్పించినట్లు అమ్మకందారులు పేర్కొన్నారు. వినియోగదారుల అభిరుచికి అనుగుణంగా తీరొక్క డిజైన్లలో మట్టిపాత్రలను అందుబాటులో ఉంచారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, నిర్మల్

క్లుప్తంగా

కొనసాగుతున్న ఇంటర్ పరీక్షలు

ఖానాపూర్: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలతోపాటు ఏఆర్‌ఎస్ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రాల్లో ఇంటర్ పరీక్షలు కొనసాగుతున్నాయి. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సోమవారం 273 మంది విద్యార్థులకు గాను ఐదుగురు గైర్హాజరయ్యారని ప్రిన్సిపాల్ అబ్దుల్ హమీద్ తెలిపారు. ఏఆర్‌ఎస్ జూనియర్ కళాశాలలో 272 మంది విద్యార్థులకు గానూ ఎనిమిది మంది గైర్హాజరైయినట్లు ప్రిన్సిపాల్ రమేశ్ పేర్కొన్నారు.

ఎల్లమ్మకు బోనాలు



బోనాలతో వస్తున్న భక్తులు

కుభీర్:మండలకేంద్రంలోని ఎల్లమ్మతల్లికి సోమవారం బోనాలను నైవేద్యంగా సమర్పించారు. జాతరలో భాగంగా సోమవారం భక్తులు బోనాలను ఎత్తుకొని ఆలయానికి వెళ్లారు. పుట్ట మన్ను తేవడం తదితర కార్యక్రమాలు నిర్వహించారు. బుధవారం కలాణ్యం జరగనుంది.

నూతన నియామకం

నర్సాపూర్(జి): యాదవ సంఘం నర్సాపూర్(జి) మండల అధ్యక్షుడిగా నూక హన్మాండ్లు యాదవ్‌ను ఏకగ్రీవంగా నియమించినట్లు అఖిల భారతీయ యాదవ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఓరుగంటి వెంకటేశ్వర్లు యాదవ్ ఓ ప్రకటనలో తెలిపారు. సంఘం అభివృద్ధికి కృషి చేస్తానని హన్మాండ్లు పేర్కొన్నారు.

కరాటే బెల్ట్ గ్రేడింగ్ పోటీలు

నిర్మల్‌టౌన్: జిల్లాకేంద్రంలో జపాన్ కరాటే అసోసియేషన్ ఆఫ్ ఇండియా నిర్మల్‌శాఖ ఆధ్వర్యంలో సోమవారం కరాటే బెల్ట్ గ్రేడింగ్ పోటీలను నిర్వహించారు. ఇందులో బాబాపూర్ జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాలకు చెందిన ఐదుగురు విద్యార్థులు జూనియర్ రెడ్ బెల్టులు సాధించారు. సృజన, అభిజ్ఞ, కీర్తన, సహస్ర, సహింత బెల్ట్‌లను సాధించారు. చీఫ్ ఎగ్జామినర్ తేజందర్‌సింగ్ భాటియా, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సీసీ కెమెరా విరాళం



దాతను సన్మానిస్తున్న కమిటీ సభ్యులు

కుంటాల: మండలంలోని ఓలాలోని శివాలయానికి గ్రామానికే చెందిన ఇప్ప గంగాధర్ సోమవారం సీసీ కెమెరాను విరాళంగా అందజేశారు. ఈసందర్భంగా దాతను ఆలయ కమిటీ సభ్యులు సన్మానించారు. ఆలయ కమిటీ సభ్యులు మేదరి గణపతి, కోశాధికారి కట్ట రవి, కార్యదర్శి తుమ్మల రాజ్‌కుమార్, సభ్యులు ఎగ్గం నర్సింలు, గంగాప్రసాద్, జగదీశ్వర్, శివకుమార్ పాల్గొన్నారు.

నేడు ఎమ్మెల్యే రాక

కుభీర్: మండలంలోని దొడర్నాకు నేడు(మంగళవారం)ఎమ్మెల్యే పి.రామారావ్ పటేల్ రానున్నట్లు బీజేపీ మండలాధ్యక్షుడు ఏశాల దత్తాత్రి ఒక ప్రకటనలో తెలిపారు. ఐటీడీఏ నిధులు రూ.3కోట్లతో మహారాష్ట్ర సరిహద్దు వరకు నిర్మించే రోడ్డు పనులను ఎమ్మెల్యే శంకుస్థాపన చేస్తారని.. కార్యకర్తలు, నాయకులు హాజరు కావాలని కోరారు.

పేకాట రాయుళ్ల అరెస్ట్

తానూరు: మండలకేంద్రంలోని ధర్మాబాద్ రోడ్డుకు ఆనుకొని ఉన్న ఓ షాపులో పేకాట ఆడుతున్న నలుగురిని సోమవారం అరెస్టు చేసినట్లు ఏఎస్సై భానుప్రసాద్ తెలిపారు. పక్కా సమాచారంతో దాడి చేసి అదే గ్రామానికి చెందిన నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకొని వారి నుంచి రూ.4,490 స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై పేర్కొన్నారు.

రాజగోపురం ప్రతిష్ఠాపన



ఆలయంలో నిర్మించిన రాజగోపురం

మామడ: మండలంలోని పొన్కల్‌లో రాజగోపురం ప్రతిష్ఠాపన సోమవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం వేదపండితులు విజయ్‌స్వామి, రామచంద్రాచార్యుల మంత్రోచ్ఛరణల నడుమ కార్యక్రమం ప్రారంభించారు. భక్తులు తరలివచ్చి పూజలు చేశారు. డీసీసీబీ డైరెక్టర్ చిక్యాల హరీశ్‌కుమార్ ఆలయానికి రూ.2.50లక్షలను విరాళంగా అందించారు. గంగారెడ్డి, సుధాకర్‌రెడ్డి, రాజేశ్వర్, ఇప్ప రవి తదితరులు పాల్గొన్నారు.

‘అమృత్’ తో తీరనున్న నీటి కష్టాలు

- బీజేఎల్పీ నేత మహేశ్వర్‌రెడ్డి
- నిర్మల్‌లో రూ.62.5 కోట్ల పనులకు శంకుస్థాపన



శంకుస్థాపన చేస్తున్న మహేశ్వర్‌రెడ్డి

నిర్మల్‌చైన్‌గేట్: కేంద్రప్రభుత్వం ప్రవేశపెట్టిన అమృత్ పథకంతో నిర్మల్‌లో తాగునీటి కష్టాలు దూరమవుతాయని నిర్మల్ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి అన్నారు. సోమవారం ఎమ్మెల్యే తన క్యాంపు కార్యాలయంలో రూ.62.5 కోట్లతో చేపట్టే తాగునీటి పథకానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మహేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ కేంద్రప్రభుత్వం ప్రజలకు సురక్షిత నీరు అందించడమే లక్ష్యంగా వివిధ కార్యక్రమాలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. గత పాలకులు పట్టణంలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటు చేస్తామని బూటకపు హామీలు ఇచ్చి ఓట్లు దండుకున్నారని ఆరోపించారు. ఎమ్మెల్యేగా గెలిపించినందుకు కేంద్ర ప్రభుత్వం ద్వారా పట్టణంలో ఎస్టీపీ ప్లాంట్ల ఏర్పాటుకు రూ.42 కోట్ల మంజూరుకు కృషి చేసినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు మాజీ ఎమ్మెల్యే నల్ల ఇంద్రకరణ్‌రెడ్డి, నాయకులు రావుల రాంనాథ్, సత్యనారాయణ గౌడ్, మెడిసెమ్మ రాజు, ఆకుల కార్తీక్, సుంకరి సాయి, సాధం అరవింద్, నవీన్, నరేందర్, శంకర్, సూరి పాల్గొన్నారు.

ఏలేటి పూజలు

మామడ: మండలంలోని పొన్కల్ శ్రీలక్ష్మీ వేంకటేశ్వరాలయంలో సోమవారం బీజేఎల్పీ నేత మహేశ్వర్‌రెడ్డి పూజలు చేశారు. ఈసందర్భంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో వారిని సన్మానించారు. ఆలయ అభివృద్ధికి కృషి చేస్తానని పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే నల్ల ఇంద్రకరణ్‌రెడ్డి, సత్యనారాయణగౌడ్, కోండ్ర రాజారెడ్డి, రంజిత్, నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి కృషి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రామారావు పటేల్

భైంసాటౌన్: ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే పి.రామారావు పటేల్ అన్నారు. పట్టణంలోని ఆయన నివాసంలో అనసూయ పవార్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సోమవారం ఉపాధ్యాయులకు కృతజ్ఞత కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులు సంఘాలకు అతీతంగా జాతీయ వాదానికి ఓటేసి ఎమ్మెల్సీగా బీజేపీ అభ్యర్థిని గెలిపించినందుకు ధన్యవాదాలు తెలిపారు. అసెంబ్లీలో ఉపాధ్యాయుల సమస్యలపై ప్రస్తావిస్తానని.. శాసనమండలిలోనూ ఎమ్మెల్సీ కొమురయ్య ప్రశ్నించే గొంతుకగా పని చేస్తారని పేర్కొన్నారు. అనంతరం ఉపాధ్యాయ సంఘాల నాయకులను ఆయన ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో లోకేశ్వరం ఎంఈవో చంద్రకాంత్, ఉపాధ్యాయ సంఘాల నాయకులు నవీన్, శంకర్, బాజిరెడ్డి, వినోద్, ధర్మాజీ, రవికాంత్, మనోహర్ రెడ్డి, శ్రీనివాస్, గంగాధర్, ఏఎంసీ మాజీ చైర్మన్ రాజేశ్‌బాబు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

ఆవాసంలో అనాథ బాలుడి చేరిక



నిర్వాహకులకు అప్పగిస్తున్న గ్రామస్తులు

భైంసాటౌన్: తల్లిదండ్రులను కోల్పోయిన ఓ అనాథ బాలుడిని గ్రామస్తులు పట్టణంలోని వివేకానంద అనాథ పిల్లల ఆవాసంలో చేర్పించారు. తానూరు మండలం ఎల్వికి చెందిన బాలుడు బంటుసాబ్ దేవాన్ తల్లిదండ్రులు చంద్రకళ–నారాయణ చనిపోయారు. దీంతో అనాథగా మారిన బా లు డిని పలువురు గ్రామస్తులు వివేకానంద ఆవాసంలో నిర్వాహకులకు అప్పగించారు. కార్యక్రమంలో ఆవాసం అధ్యక్షుడు శైలేశ్ మాశెట్టివార్, ఎల్వి గ్రామ మాజీ సర్పంచ్ పోతారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గ్రామ సమస్యలు పరిష్కరించాలి



ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుతో కాంగ్రెస్ నాయకులు

కడెం: మండలంలోని ఎలగడప గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు సోమవారం ఉట్నూర్‌లోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్‌ను కలిశారు. ఈసందర్భంగా గ్రామంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించి.. అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ భూమేశ్, మహమ్మద్ సలీం, అబ్దుల్ రహీం తదితరులున్నారు.

ఇప్పమాడలో ఘనంగా విగ్రహ ప్రతిష్ఠాపన



పండితులను సన్మానిస్తున్న గ్రామస్తులు

ఖానాపూర్: మండలంలోని బీర్నంది పంచాయతీ పరిధి ఇప్పమాడ గ్రామంలో శ్రీ అభయాంజనేయ స్వామి శివపంచాయతన, నవగ్రహ, ధ్వజస్తంభ విగ్రహ ప్రతిష్ఠాన మహోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా పండితులు పిసుపాటి రేవంత్‌శర్మ వైదిక బృందం ఆధ్వర్యంలో ఆలయ త్రయాహ్నిక, స్థిర యంత్ర ధ్వజ, విగ్రహ, శిఖర ప్రతిష్ఠాపన మహోత్సవం నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదం, అన్నదానం అందించారు. ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు కోవ లచ్చు, కోవ సుంగు, పేంద్రం చిన్నజైతు, సురేశ్, గణేశ్ తదితరులు ఉన్నారు.

పొదుపు అలవర్చుకోవాలి

సోన్: మండలంలోని పాక్‌పట్ల ఉన్నత పాఠశాలలో సోమవారం బాలశక్తి కార్యక్రమం నిర్వహించారు. అందులో భాగంగా విద్యార్థులకు విద్స్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఆర్థిక అక్షరాస్యతపై క్విజ్ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందించినట్లు హెచ్‌ఎం వెంకన్న తెలిపారు. ప్రథమ బహుమతి డి.అభిరామ్ గ్రూప్, ద్వితీయ బహుమతి కె.శేఖర్ గ్రూప్ అందుకున్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు తొడిశెట్టి రవికాంత్, సంస్థ కౌన్సిలర్ భరత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వెండి పంచపాల అందజేత

ఖానాపూర్: పట్టణంలోని శాంతినగర్‌కాలనీ ముత్యాల పోచమ్మ ఆలయానికి ఉప్పుల వరలక్ష్మి–శంకర్ దంపతులు 120 గ్రాముల వెండితో తయారుచేసిన పంచపాలను అందజేశారు. అర్చకులు నిమ్మగడ్డ శరత్‌చంద్రశర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేసి పంచపాలను ఆలయంలో ఉంచారు.

మొక్కల పెంపకం పర్యవేక్షించాలి

ఖానాపూర్: గ్రామపంచాయతీ నర్సరీల్లో పెరుగుతున్న మొక్కలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని ఎంపీవో రత్నాకర్‌రావు అన్నారు. సోమవారం మండలంలోని సేవ్యానాయక్‌తండా పంచాయతీ కార్యాలయాన్ని సందర్శించారు. రికార్డులు తనిఖీ చేశారు. అంతకుముందు సెగ్రిగేషన్ షెడ్, వైకుంఠ ధామం, డ్రెయినేజీలను పరిశీలించారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

మామడ: మండలంలోని వాస్తపూర్ గ్రామ మాజీ సర్పంచ్ తులసీబాయి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా సోమవారం బాధిత కుటుంబాన్ని డీసీసీ అధ్యక్షుడు శ్రీహరిరావు పరామర్శించారు. శ్రీనివాస్‌రెడ్డి, సంతోష్, లింగారెడ్డి ఉన్నారు.

ముధోల్: మండలంలోని తరోడాలో సాయాగౌడ్ మృతి చెందగా బాధిత కుటుంబాన్ని బీజేపీ నాయకులు మోహన్‌రావుపాటిల్ పరామర్శించారు.

1930కి ఫిర్యాదు చేయాలి

లోకేశ్వరం: సైబర్ మోసాలకు గురైతే వెంటనే 1930నంబర్‌కు ఫిర్యాదు చేయాలని లోకేశ్వరం టీజీబీ మేనేజర్ అశోక్ అన్నారు. సోమవారం మండలకేంద్రంలోని కేజీబీవీలో బ్యాంకు లావాదేవీలు, సైబర్ నేరాలు, ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కల్పించారు. ప్రిన్సిపాల్ అనసూయ, సిబ్బంది విజయ్, మల్లేశ్ ఉన్నారు.

పసుపు ధర పెంచాలని ధర్నా

లక్ష్మణచాంద: పసుపు పంటకు మద్దతు ధర చెల్లించాలని లక్ష్మణచాంద మండలంలోని చింతల్‌చాంద గ్రామ రైతులు సోమవారం నిజామాబాద్‌లో ధర్నా నిర్వహించారు. పంటకు మద్దతు ధర ఒక్కసారిగా పడిపోయిందని పేర్కొన్నారు. ప్రస్తుతం క్వింటాల్ పసుపు పంటకు రూ.6 వేల నుంచి రూ.8 వేలు అందిస్తున్నారని.. ఈ ధర తమకు గిట్టుబాటు కాదని రైతులు వాపోయారు.

నిరుపేదలకు సీఎంఆర్‌ఎఫ్ వరం

- డీసీసీ అధ్యక్షుడు శ్రీహరిరావు



చెక్కు అందిస్తున్న శ్రీహరిరావు

నిర్మల్‌చైన్‌గేట్: నిరుపేదలకు సీఎం రిలీఫ్‌ఫండ్ వరమని డీసీసీ అధ్యక్షుడు కూచాడి శ్రీహరిరావు అన్నారు. జిల్లాకేంద్రంలోని తన క్యాంప్ కార్యాలయంలో సోమవారం నియోజకవర్గంలోని ఆయా గ్రామాలకు చెందిన 15 మంది లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం పేదల పక్షాన ప్రజాపాలన అందిస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో సారంగాపూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ అబ్దుల్ హాది, మండలాధ్యక్షుడు భుజంగ శ్రీనివాస్‌రెడ్డి, ఓడ్నాల రాజేశ్వర్, బొల్లోజి నర్సయ్య, ఆలయ కమిటీ చైర్మన్ గంగోని బూరాజ్, కొండ శ్రీనివాస్, ఈటల శ్రీనివాస్, గాజుల రవికుమార్, నల్లూరి పోశెట్టి, పోశెట్టి, కలీం, మజార్‌ఖాన్, చిరంజీవి, నరేందర్, సంతోష్, మల్లాపూర్ ముత్యం, ముత్యంరెడ్డి, సత్యపాల్ రెడ్డి ఉన్నారు.

డీసీసీ అధ్యక్షుడి విరాళం

మామడ: మండలంలోని పొన్కల్ శ్రీలక్ష్మీవేంకటేశ్వరాలయానికి డీసీసీ అధ్యక్షుడు కూచాడి శ్రీహరిరావు రూ.లక్ష నూట ఒక వెయ్యి పదహార్లను(1,01,016) విరాళంగా అందించారు. రాజగోపురం ప్రతిష్ఠాపనలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో శ్రీనివాస్‌రెడ్డి, లింగన్న, లింగారెడ్డి, గంగారెడ్డి, శేఖర్, నర్సారెడ్డి, భూమేశ్వర్ పాల్గొన్నారు.

పేదలకు అండగా రాష్ట్ర ప్రభుత్వం

భైంసాటౌన్: కాంగ్రెస్ ప్రభుత్వం పేదలకు అండగా ఉంటుందని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే బి.నారాయణ్‌రావు పటేల్ అన్నారు. సోమవారం పట్టణంలోని తన క్యాంప్ కార్యాలయంలో నియోజకవర్గంలోని పలువురు లబ్ధిదారులకు రూ.4.50 లక్షల విలువైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు శంకర్ చంద్రే, ముత్యంరెడ్డి, రాంచందర్‌రెడ్డి, చంద్రకాంత్, భోజరాం పటేల్, తదితరులు పాల్గొన్నారు. పట్టణంలోని పులేనగర్‌కు చెందిన గంగాధర్ ఇటీవల మృతి చెందగా బాధిత కుటుంబసభ్యులను పరామర్శించారు.

ముధోల్‌లో..

ముధోల్: మండల కేంద్రంలో ముధోల్ తాలూకా మున్నూర్‌కాపు సంఘం అధ్యక్షుడు రోళ్ల రమేశ్ తల్లి ఇటీవల మృతి చెందగా సోమవారం బాధిత కుటుంబాన్ని మాజీ ఎమ్మెల్యే నారాయణ్‌రావు పటేల్ పరామర్శించారు. ఆయన వెంట కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షులు రావుల గంగారెడ్డి, శంకర్ చంద్రే, దొడ్డు ప్రసాద్, ముత్యంరెడ్డి, రాంచందర్, కిషన్, ప్రేమ్‌నాథ్, అజీజ్, దిగంబర్, లక్ష్మణ్, చంద్రకాంత్, నాగేష్ తదితరులున్నారు.

సావిత్రిబాయి పూలేకు నివాళి



పూలమాల వేస్తున్న బీసీ సంక్షేమ సంఘం నేతలు



జ్యోతిబా గురుకులంలో..

నిర్మల్‌టౌన్: సావిత్రిబాయిని ఆదర్శంగా తీసుకొని మహిళలు అన్ని రంగాల్లో ముందుకు సాగాలని బీసీ సంక్షేమ సంఘం గౌరవ అధ్యక్షుడు డాక్టర్ ఉప్పు కృష్ణంరాజు అన్నారు. జిల్లాకేంద్రంలోని బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సోమవారం సావిత్రిబాయి పూలే వర్ధంతి నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు చంద్రశేఖర్, జిల్లా కో–కన్వీనర్ కిషన్ పాల్గొన్నారు.

నిర్మల్‌రూరల్: జిల్లాకేంద్రంలోని మహాత్మా జ్యోతిబాపూలే గురుకులం(బాలుర)లో సోమవారం సావిత్రిబాయి పూలే వర్ధంతి నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె చిత్రపటానికి నివాళులర్పించారు. విద్యార్థులకు పలురకాల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులను అందించారు. ప్రిన్సిపాల్ అనిల్‌కుమార్, ఉపాధ్యాయులు ఉన్నారు.

పశువులకు అందని వైద్యం..

- శిథిలావస్థలో లోకేశ్వరం పశువైద్యశాల
- సరిపడా సిబ్బంది కరువు
- మండలానికి ఇన్‌చార్జి వైద్యుడు, అటెండర్లే దిక్కు
- అవస్థలు పడుతున్న కాపరులు



పొట్టేలుకు చికిత్స చేస్తున్న పశువుల కాపరి



మేతకు వెళ్తున్న పశువులు

లోకేశ్వరం: మండలంలో మూగజీవాలకు మెరుగైన వైద్యం అందకపోవడంతో ఇటు జీవాలు.. అటు పోషకులకు ఇబ్బందులు తప్పడం లేదు. మండలంలో లోకేశ్వరంలో పశువైద్యశాల, కన్కపూర్‌లో పశువైద్య కేంద్రం ఉన్నాయి. ప్రస్తుతం ఈ రెండు కేంద్రాల్లో ఇద్దరు అటెండర్లు మాత్రమే విధులు నిర్వర్తిస్తున్నారు. కన్కపూర్‌లో నాలుగేళ్లుగా సిబ్బంది లేరు. కేవలం అటెండరే వైద్యం చేస్తున్నాడు. లోకేశ్వరం ఇన్‌చార్జి పశువైద్యాధికారిగా ముధోల్ మండలం ఎడ్‌బిడ్ పశువైద్యాధికారి బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. దీంతో మూగజీవాలు అనారోగ్యం బారిన పడినప్పుడు పోషకులు వాటికి సరైన వైద్యం అందక ఇబ్బంది పడుతున్నారు.

మండలంలో పశువుల సంఖ్య..

మండలంలో 25 గ్రామపంచాయతీ లున్నాయి. ఇందులో ఆవులు 12 వేలు, గేదెలు 9 వేలు, గొర్రెలు 67వేలు, మేకలు 5వేలు ఉన్నాయి. ఈ మండలంలో ఉన్న గ్రామాలకు ఆరు ఉపకేంద్రాలు, 18 మంది సిబ్బంది ఉండాలి. కాని ప్రస్తుతం లోకేశ్వరంలో పశువైద్యశాల, కన్కపూర్‌లో ఉపకేంద్రం ఉన్నాయి. మండలకేంద్రంలో పశువైద్యశాలను ఆనుకొని ఆర్ అండ్‌బీ రోడ్డు నిర్మించడంతో సదరు పశువైద్యశాల రోడ్డు కిందికి వెళ్లిపోయి శిథిలావస్థకు చేరింది. చిన్నపాటి వర్షం కురిసినా రోడ్డుపై నుంచి వరద వచ్చి గదుల్లో చేరుతోంది. రికార్డులు తడుస్తున్నాయి.

సిబ్బంది వివరాలు..

లోకేశ్వరం పశువైద్యశాలలో ఒక పశువైద్యాధికారి, వెటర్నరీ అసిస్టెంట్, అటెండర్ ఉండాలి.. కానీ ప్రస్తుతం అటెండర్ విధులు నిర్వర్తిస్తున్నా డు. కన్కపూర్‌లో పశువైద్య ఉపకేంద్రంలో పశువైద్యాధికారి, వెటర్నరీ అసిస్టెంట్, అటెండర్ ఉండాల్సి ఉండగా .. అటెండర్ మాత్రమే విధులు నిర్వర్తి స్తున్నారు.

ప్రభుత్వం అందించే టీకాలు..

ఏటా పశువులకు రెండుసార్లు గాలికుంటు నివారణ టీకాలు అందిస్తున్నారు. వ్యాధి వ్యాప్తిని బట్టి జిల్లాలో అక్కడక్కడా మండలాల్లో గొంతువాపు, జబ్బవాపు వ్యాధులకు జీవాలకు వ్యాధి నిరోధక టీకాలు వేస్తున్నారు. గొర్రెలకు ప్రతి ఏడాది పీపీఆర్, షీక్ పాక్స్, బ్లూటంగ్ వ్యాధులకు టీకాలు అందిస్తున్నారు. సిబ్బంది లేక ఈ టీకాలను సరిగా అందించడం లేదని పశుపోషకులు వాపోతున్నారు.

వైద్యం చేసుకుంటున్నాం



మండలంలో సరిపడా పశువైద్య సిబ్బంది లేకపోవడంతో ఇబ్బంది పడుతున్నాం. జీవాలకు మేమే వైద్యం చేసుకుంటున్నాం. పశువైద్య ఉపకేంద్రాలను ఏర్పాటు చేసి పశువులకు వైద్యం అందించాలి.

– సొల్లు పోశెట్టి, కాపరి, ధర్మోర

ఇబ్బందుల్లేకుండా చూస్తాం

సిబ్బంది కొరత మాట వాస్తవమే. పశువులు రోగాల బారిన పడితే పశువైద్యులకు ఫోన్ ద్వారా సమాచారం ఇవ్వాలి. వెంటనే అక్కడికి వెళ్లి వైద్యం అందిస్తాం.

– రవీందర్, ఇన్‌చార్జి పశువైద్యాధికారి, లోకేశ్వరం

డీఎంహెచ్‌వోకు ప్రశంసలు



డీఎంహెచ్‌వోను అభినందిస్తున్న కలెక్టర్

నిర్మల్‌చైన్‌గేట్: మహిళా దినోత్సవం పురస్కరించుకుని సోమవారం కలెక్టరేట్‌లో మహిళా శక్తి క్యాంటీన్‌లో జిల్లా అధికారులకు పోటీలు నిర్వహించారు. ఇందులో భాగంగా కాఫీ, మ్యాగీ చేయడం వంటి పోటీలు నిర్వహించగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ రాజేందర్ రుచికరమైన టీ చేసి కలెక్టర్ అభిలాష అభినవ్, డీఆర్డీవోకు అందించారు. టీ సేవించిన అధికారులు డీఎంహెచ్‌వోను ప్రత్యేకంగా ప్రశంసించారు.